పడకేసిన పారిశుధ్యం...!

- కురిసిన వర్షాలకు గ్రామాల్లో నీరు నిల్వ
- దోమలకు ఆవాసాలుగా మారిన వైనం
- డెంగీ, మలేరియా ప్రబలే ప్రమాదం
- అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకమే..!
- పరిసరాల శుభ్రత ఏకైక లక్ష్యమంటున్న వైద్యులు

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వర్షపు నీరు నిలిచింది. ప్రజల నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండడంతో మురుగుమయమై దోమలకు ఆవాసంగా మారాయి. కలుషిత నీరు, పారిశుధ్య లోపం, దోమల కారణంగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్ ప్రబలే ప్రమాదం ఉంది. జ్వరాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పలు గ్రామాల్లో వైద్య సిబ్బంది సూచిస్తున్నారు. అనాఫిలస్ అనే దోమకాటు వల్ల మలేరియా వ్యాపిస్తుంది. నిల్వ ఉన్న నీటితో పాటు తాగునీటిలో కూడా ఈ దోమ వృద్ధి చెందుతుంది. ఈ దోమ వల్ల సోకే జ్వరం 10 నుంచి 15 రోజులపాటు ఉండి వాంతులు కూడా అవుతాయి. ముందు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దరి చేరవని వైద్యులు ప్రజలకు సూచిస్తున్నారు.

మలేరియా, డెంగీ ముఖ్య లక్షణాలు

ఇంటి లోపల, బయట నిల్వ ఉన్న నీటిలో డెంగీ దోమ గుడ్లు పెడుతుంది. ఈ వ్యాధి సోకిన 15 రోజుల పాటు జ్వరం ఉంటుంది. తలనొప్పితో రోగి చాలా బాధపడతాడు. కడుపు నొప్పి కూడా వస్తుంది. మలేరియా వ్యాధి అనాఫిలస్ అనే దోమ కాటు వల్ల వస్తుంది. చలి, వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం, ఒంటి నొప్పులు, మూత్రం సరిగా రాకపోవడం, లివర్, కడుపులో నొప్పి, జ్వరం మూడు రోజులకోసారి లేదా రెండు రోజులకోసారి లేదా రోజూ వస్తూ ఉండడం వ్యాధి ప్రధానమైన లక్షణాలుగా ఉంటాయని వైద్యులు తెలుపుతున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా పరీక్షలు

చిప్పగిరి ప్రభుత్వాస్పత్రిలో ఈ వ్యాధులకు ఉచితంగా చికిత్సలు చేస్తున్నారు. సంబంధిత మాత్రలు ఉచితంగా ఇస్తారు. న్యూ డ్రగ్ పాలసీ ప్రకారం తప్పనిసరిగా 14 రోజుల పాటు మందులు వాడాల్సి ఉంటుంది.

దోమల నివారణకు జాగ్రత్తలు

పరిసరాలు బాగాలేకపోతే ఇంటి పరిసరాల్లో దోమలు పెరిగేందుకు ఆస్కారం ఉంటుంది. మురుగు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలి. వారంలో ఒకరోజు ఇంట్లో నీటి నిల్వలను పారబోసి



చిప్పగిరి అంగన్వాడీ కేంద్రం సమీపంలో పేరుకుపోయిన చెత్త కుప్ప

డ్రైడేగా పాటించాలి. ఇంటి ఆవరణలో ఖాళీ కొబ్బరి బోండాలు, పాత టైర్ల రోళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. దోమలు ఇంట్లోకి రాకుండా నియంత్రించేందుకు ఉదయం, సాయంత్రం కిటికీలు మూసివేయాలి. టాయిలెట్ పైపులపై ఏదైనా ప్లాస్టిక్ కవర్ కప్పి ఉంచాలి. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమతెరలు వాడడం ద్వారా దోమకాటు బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

మలేరియా నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు


- వెంకటేశ్వర్లు, పత్తికొండ సబ్ యూనిట్ మలేరియా నివారణాధికారి



మలేరియా నివారణకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రజలకు అవగాహన కోసం ప్రత్యేక కార్యక్రమాలను రూపొందిస్తున్నాం. ప్రస్తుతం వర్షాలు ఎక్కువ ఉన్నందున, నీరు నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది మలేరియా, డెంగీ కేసు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రజలందరూ వ్యాధులపై అవగాహన కలిగి ఉండి తగిన జాగ్రత్తలు పాటిస్తే ఏ వ్యాధి కూడా దరిదాపుల్లోకి కూడా రావు. ముఖ్యంగా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. వ్యాధి లక్షణాలుంటే ప్రభుత్వాస్పత్రికి తప్పనిసరిగా వెళ్లాలి. ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా చికిత్సలు, మందులు అందజేస్తున్నాం.

దోమల నుంచి రక్షణ పొందేలా చూసుకోవాలి

- ప్రభుత్వాస్పత్రి డాక్టర్ అఫ్రోజ్ జహాన్



ఇటీవల కాలంలో వర్షాలు ఎక్కువగా కురుస్తున్న నేపథ్యంలో అక్కడక్కడ కొద్ది వరకు విష జ్వరాలు నమోదవుతున్నాయి. ముఖ్యంగా దోమకాటు నుంచి రక్షణ పొందాలి. విష జ్వరాలు వస్తే మందులు వాడితే తగ్గిపోతుంది.. ఏమి చేస్తుందిలే అని ఎవరూ అనుకోవద్దు. జలుబు, తలనొప్పి, వాంతులు, ఒంటిపై దద్దుర్లు ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలి. అజాగ్రత్తగా ఉంటే వ్యాధి తీవ్రత పెరిగే అవకాశం ఉంటుందని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. పరిసరాల పరిశుభ్రతతో రోగాలను అధిగమించవచ్చు.

సామాజిక సమానత్వాన్ని చాటిన కనకదాసు

- ఘనంగా భక్త కనకదాసు జయంతి - జెసి నూరుల్ కమర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మనుషులలో వివిధ కులాలు ఉన్నప్పటికీ మనుషులంతా ఒక్కటే అని చాటిన వ్యక్తి కనకదాసు అని జెసి నూరుల్ కమర్ పేర్కొన్నారు. శనివారం భక్త కనకదాసు జయంతోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. జెసి మాట్లాడుతూ భక్త కనకదాసు మంచి గాయకుడని, 16వ శతాబ్దం లోనే సమతా వాదిగా గుర్తింపబడ్డారన్నారు. ఆయన పాడిన, రచించిన గేయాలను అందరూ స్వాగతించారన్నారు. తన కీర్తనల ద్వారా భక్తి తత్వాన్ని, సామాజిక సమానత్వాన్ని బోధించిన గొప్ప తత్వ వేత్త అని కొనియాడారు. ఆ కాలంలో చిన్న కులాల వారిని చిన్నచూపు చూసే వారని, దానిని అధిగమించి ఆయన అందరి మన్నలను తన భక్తి గీతాల ద్వారా సాధించారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని అందరూ అభివృద్ధిలోకి రావాలని తెలిపారు. సమాజంలో ఎలా నడుచుకోవాలి, సమస్యలపట్ల ఎలా స్పందించాలనేది భక్తి తత్వం తదితర అంశాలన్నీ ఆయన ద్వారా నేర్చుకోవలసిన అంశాలని వివరించారు. బిసి వెల్ఫేర్ అధికారి ప్రసూన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బిసి సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, వాటన్నిటిని, సామాజిక వర్గం వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భక్త కనకదాస 16వ శతాబ్దంలో మహోన్నత వ్యక్తిగా కీర్తింపబడ్డారని తెలుపుతూ ఆయన జీవన కాలంలో జరిగిన సంఘటనలను, కష్టతత్వములను వివరించారన్నారు. బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాకీర్ హుస్సేన్, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ మల్లికార్జున, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్, కురువ సంఘం డైరెక్టర్ శ్రీనివాసులు, గొర్ల సంఘం చైర్మన్ శ్రీనివాసులు, గొర్ల సొసైటీ డైరెక్టర్ మద్దిలేటి, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్బయ్య, కురువ సంఘం డైరెక్టర్ వెంకట రాముడు, జిల్లా కురువ సంఘం అధ్యక్షులు రంగస్వామి, మహిళా అధ్యక్షులు లీలమ్మ, పత్తికొండ శ్రీనివాసులు, శివ నారాయణ, రవికుమార్, ధనుంజయుడు, రామచంద్రుడు , దుర్గన్న, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి నూరుల్ కమర్

షాషా మసీదు షాపుల సమస్యకు తెర

- ట్రాఫిక్ నియంత్రణకు సహకారం అభినందనీయం

- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలోని బుధవారపేట, మెడికల్ కాలేజీ వద్ద మలుపు విస్తరణకు షాపులను స్వచ్ఛందంగా తొలగించడం ద్వారా షాషా మసీదు కమిటీ సభ్యులు సహకరించినందుకు షాపుల సమస్య పరిష్కారమైంది. నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అభినందించారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి కమిషనర్ క్యాంపు కార్యాలయంలో కమిటీ సభ్యులకు భవన నష్టపరిహారం చెక్కును అందజేశారు. శనివారం కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని బుధవారపేట వద్ద ట్రాఫిక్ అంతరాయం కారణంగా దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర మంత్రి టిజి. భరత్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం 2025 అక్టోబర్ 17న ఇచ్చిన ఆదేశాల ప్రకారం, 4.75 సెంట్ల స్థలంలో ఉన్న 7 షాపులకు రూ.27,11,994 విలువైన చెక్కులు అందజేశామన్నారు. యాజమాన్య హక్కులను సమర్పించిన తర్వాత టిడిఆర్ బాండ్లను కూడా త్వరితగతిన జారీ చేస్తామని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని 'చారిత్రాత్మక మలుపు'గా కమిషనర్ అభివర్ణించారు. నగరాభివృద్ధిలో భాగంగా సామరస్యంగా సమస్య పరిష్కారానికి సహకరించిన మసీదు కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డిప్యూటీ సిటీ ప్లానర్ బి.వెంకటరమణ, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్ బాష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దివాకర్, అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు మన్సూర్ అలీఖాన్, కార్పొరేటర్ జుబేర్, ముత్తవల్లి అజాం, అబ్బాస్, హమీద్, రజాక్, మహబూబ్ పీర్, మునావర్ పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న కమిషనర్ విశ్వనాథ్

కరువు కానరాలేదు..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఇటీవలి మొంథా తుపాన్ వర్షాలను చూపించి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కీలక సమయాల్లో నెలకొన్న తీవ్ర వర్షాభావాన్ని, డ్రైస్పెల్స్‌ను పరిగణనలోకి తీసుకోకుండా పలు ప్రాంతాల్లోని కరువే లేనట్లు ప్రభుత్వం ప్రకటన చేసింది. ఒక మండలంలో వరుసగా 21 రోజులు వర్షం కురవకపోతే దాన్ని ఒక డ్రైస్పెల్‌గా పరిగణిస్తారు. పంటలు సాగైనా డ్రైస్పెల్ నెలకొంటే పైకి ఎదగవు. ఎండిపోతాయి. దిగుబడి పడిపోతుంది. అలాంటి పరిస్థితి ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో నాలుగు మండలాలు, నంద్యాల జిల్లాలో నాలుగు మండలాలతో కలిపి ఉమ్మడి జిల్లాలో ఎనిమిది మండలాల్లో ఏర్పడింది. ఆ పరిస్థితిని కూడా ప్రభుత్వం పట్టించుకోకుండా జిల్లాలోని ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించలేదు. జిల్లాలో ఖరీఫ్ ప్రారంభంలో కాస్త చినుకు జాడ కనిపించడంతో పంట సాగుకు రైతులు ఆసక్తి చూపారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు కొంచెం ముందుగానే మే 25, 26 తేదీల్లో రాష్ట్రంలో ప్రవేశించగా తొలి నాళ్లలో బాగానే వర్షాలు పడ్డాయి. అనంతరం దీర్ఘకాలం మొరాయించాయి. అడపా దడపా పడ్డ వర్షాలతో రైతులు అతికష్టం మీద సాగు సాగించారు. తీరా పంట ఎదిగే సమయంలో పంట తడికి సరిపడా వర్షం కురవకపోవడంతో ఈ ఖరీఫ్ లో రైతులకు ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. సరైన వర్షాలు లేక సరైన దిగుబడులు అందలేదు. వర్షంపై ఆధారపడిన పశ్చిమ ప్రాంతంలోని ఆదోని, ఎమ్మిగనూరు, హొళగుంద, ఆలూరు, ఆస్పరి, కోసిగి వంటి మండలాల్లో పత్తి పంట చాలా వరకూ దెబ్బతింది. గతేడాదికన్నా చాలా తక్కువ దిగుబడి వచ్చింది. కంది పంట కూడా ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. సరైన వర్షం లేక ఈ ఖరీఫ్‌లో రైతన్నలు తీవ్ర నష్టాన్ని మూటకట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినా కూడా ప్రభుత్వం జిల్లాలో కరువు మండలాలను గుర్తించకపోవడంపై రైతులు, రైతు సంఘాల నుంచి తీవ్ర ఆగ్రహం వక్తం అవుతోంది.

సాగని రబీ : అధిక వల్ల రబీ సాగు ముందుకు సాగడం లేదు. వర్షాల తీవ్రత వల్ల పొలాల్లో తడి ఆరక విత్తనాలు వేసేందుకు వీలు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 10 రోజుల్లో రబీ సాగు ముగుస్తుందని భూములు చూస్తే తడి ఆరడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో విత్తనాలు వేసిన మట్టిలో తేమ ఎక్కువగా ఉండటంతో పంటలు నాశనం అవుతున్నాయని రైతులు చెబుతున్నారు. అధిక తేమతో పంటలు కుళ్ళిపోతున్నాయి. రబీ సీజన్ ప్రారంభం నుంచి భారీ వర్షాలు కురిశాయి. వరుసగా వర్షాలు పడటం వల్ల జొన్న, పప్పు శనగ, పొగాకు, మొక్క జొన్న, మినుము, కంది, వేరుశనగ మొదలైన రబీ పంటలు సాగుకు ఆటంకం కలుగుతోంది. రైతులకు పొలాల్లో పనులు చేయడం కష్టంగా మారింది. నేలల్లో తేమ అధికంగా ఉండటం వల్ల పంటలు నాటడానికి, చేలో పనులు చేయడానికి కూడా వీలు కావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. అక్టోబర్ 1 నుంచి రబీ సీజన్ ప్రారంభం కాగా అప్పటి నుంచి భారీ వర్షాలు, తుఫాన్లు చుట్టుముట్టడంతో పంటల సాగు ముందుకు సాగడం లేదు. దానికి తోడు ఇప్పటికే విత్తిన పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో మొక్క దశలోనే పైరు నీరు అధికమై కుళ్ళిపోయి చనిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు వేలల్లో పెట్టుబడులు పెట్టి సాగు చేస్తే అధిక వర్షాల వల్ల పెట్టిన పెట్టుబడి నీళ్ల పాలయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వచ్చే పది రోజులు వర్షం కురవకపోతే విత్తనం వేసుకునే అవకాశం ఉంటుందని, వర్షాలు ఇలానే కురిస్తే విత్తనం వేసే పరిస్థితి ఉండదని అతివృష్టితో నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం, సబ్సిడీ విత్తనాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

రైల్వే అభివృద్ధి కోసం పోరు: జిల్లాలో రైల్వే రంగాన్ని అభివృద్ధి చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో కర్నూలు రైల్వే స్టేషన్ ఎదుట పోరుబాట సాగించారు. రెండు రోజులు దీక్షలు చేపట్టి మూడో రోజు ధర్నా నిర్వహించారు. తక్షణమే కర్నూలు నుంచి విజయవాడకు ఇంటర్ సిటీ రైలును నడపాలని, శ్రీశైలం - మంత్రాలయం రైల్వే లైన్‌ను ప్రారంభించాలని, రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ పూర్తి చేయాలని, జిల్లాలోని కొత్త రైళ్ళ, రైల్వే లైన్ల కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.






మాట్లాడుతున్న వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

12న వైసిపి ప్రజాఉద్యమ ర్యాలీ

వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన ప్రజా ఉద్యమ ర్యాలీని జయప్రదం చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసానిరాంభూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన స్వగృహంలో ప్రజా ఉద్యమ ర్యాలీ వాల్‌పోస్టరును ఆవిష్కరించారు. కాటసాని మాట్లాడుతూ వైసిపి ప్రజా ఉద్యమం కార్యక్రమానికి సంబంధించి ఈ నెల 12న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కాటసాని రాంభూపాల్ రెడ్డి ఇంటి దగ్గర నుంచి కల్లూరు తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా నిర్వహించాలన్నారు. తహశీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గం పరిధిలోని నాయకులు, కార్పొరేటర్లు కార్యకర్తలు, ప్రజలు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వైసిపి కార్పొరేటర్లు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, టెక్నీల్ సిబ్బంది


శ్రీ చక్ర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

శ్రీచక్ర హాస్పిటల్ ఆధ్వర్యంలో అబ్బాస్‌నగర్‌లోని రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫీసులో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని శ్రీ చక్ర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డైరెక్టర్ ప్రముఖ ఆర్థోపెటిక్ వైద్యులు డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ పెన్షనర్స్‌కు వారి కుటుంబ సభ్యులకు షుగర్, బిపి, ఇసిజి, 2డి ఎకో పరీక్షలు , ఉచిత కంటి పరీక్షలు ప్రముఖ డాక్టర్ల కన్సల్టేషన్‌తో సుమారు రూ.2500 విలువైన పరీక్షలు, వైద్యాన్ని ఉచితంగా అందించామని తెలిపారు. శ్రీచక్ర హాస్పిటల్‌లో ఆల్ ప్రైవేట్ హెల్త్ ఇన్సూరెన్సు కంపెనీస్, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ, గవర్నమెంట్ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ అందుబాటులో కలవని అన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో క్రిటికల్ కేర్ వైద్యులు డాక్టర్ సాదిక్, కార్డియాలజీ వైద్యులు డాక్టర్ మహమ్మద్ అలీ డాక్టర్ రామపక్కిర, ఆప్తాల్మలజీ వైద్యులు డాక్టర్ ప్రదీప్ కుమార్, సిఇఒ నిదామ్, మేనేజర్ సురేంద్ర, రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్. రంగారెడ్డి, జనరల్ సెక్రటరి జయచంద్రారెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ రాజేష్, టుడి ఎకో టెక్నీషియన్ రామంజి , ఆప్తమాలజీ టెక్నీషియన్ వంశీ, నర్సింగ్ సిబ్బంది హనుమంతు, కావ్య తదితరులు పాల్గొన్నారు.

భక్త కనకదాసు విగ్రహానికి ఎంపి, ఎమ్మెల్యే నివాళి





భక్త కనక దాసు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎంపి నాగరాజు, ఎమ్మెల్యే దస్తగిరి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

భక్త కనక దాసు సమాజంలో సమానత్వం, భక్తి భావనలకు మార్గదర్శకులయ్యారని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. భక్త కనకదాసు జయంతి సందర్భంగా నగరంలోని బిసి భవన్ వద్ద కనకదాసు విగ్రహానికి ఆయన పూల మాల వేసి నివాళి అర్పించారు. ఎంపీ మాట్లాడుతూ అందరు కలసికట్టుగా పోరాడితే ఏదైనా సాధించగలరని చెబుతూ భక్త కనకదాసు తన కీర్తనల ద్వారా ప్రతి ఒక్కరిని చైతన్యవంతం చేశారన్నారు. భక్త కనకదాసు జయంతిని అధికారికంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు..ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి ప్రసూన, రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్లు రామకష్ణ, వెంకటరాముడు పాల్గొన్నారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ భక్త కనకదాస్ సమానత్వం, భక్తి, సత్యం, న్యాయం వంటి విలువలను ప్రజల్లో నాటిన మహానుభావులని పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు, బోధనలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు.

కనకదాస సేవలు ఆదర్శనీయం

-ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కృష్ణమోహన్

సమాజ స్థాపనకు భక్తకనకదాస సేవలు ఆదర్శనీయమని ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కృష్ణమోహన్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సామాజిక సంస్కర్త, గొప్ప కవి శ్రీ భక్త కనకదాస జయంతి వేడుకలను కర్నూలు పోలీసులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కృష్ణమోహన్ శ్రీ భక్త కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఆయన శ్రీ భక్త కనకదాస తన కీర్తనల ద్వారా సమాజంలో పాతుకుపోయిన కుల వ్యవస్థను, అసమానతలను నిర్భయంగా ప్రశ్నించారన్నారు. మానవత్వపు విలువలే అత్యున్నతమని చాటిచెప్పారన్నారు. శ్రీ భక్త కనకదాస స్ఫూర్తిని కొనసాగిస్తూ పోలీసు శాఖ కూడా సమాజంలో ఎలాంటి వివక్ష లేకుండా , అట్టడుగు వర్గాలకు కూడా సత్వర న్యాయం అందించే దిశగా చిత్తశుద్ధితో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ఆర్ఐపోతలరాజు, ఆర్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




కనక దాసు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎఎస్‌పి కృష్ణమోహన్

గురుకుల స్టేడియం అభివృద్ధికి పూర్వవిద్యార్థుల విరాళం

ప్రజాశక్తి- సి బెళగల్

గురుకులంలో 2005-2010కు చెందిన పూర్వ విద్యార్థులు స్టేడియం అభివృద్ధి కోసం రూ.50 వేలను విరాళం ఇచ్చారు. శనివారం పాఠశాలలో పూర్వ గురువులను సాష్టాంగ నమస్కారాలతో పూలమాలలు వేసి సన్మానం చేశారు. నాటి జ్ఞాపకాలను, నాటి విద్యా బోధనను నేడు ఆయారంగాల్లో స్థిరపడిన హావ భావాలను ఒకరినొకరు పంచుకొన్నారు. ప్రస్తుత విద్యార్థులు కూడా అన్నీ రంగాల్లో ముందుకు వెళ్లాలని జన్మనిచ్చిన తల్లిదండ్రులను, ఊరిని, భవిష్యత్తును ఇచ్చిన గురువులను మరచి పోకూడదని నిర్వాహకులు వంశీ, రాము, అంబేద్కర్, ప్రవీణ్ భాస్కర్, తిమ్మరాజు, రామరాజు, డి వై శ్రీను పాల్గొన్నారు.



ఓపెన్ స్కూలు విద్యార్థులకూ సమాన అవకాశాలు

-అసిస్టెంట్ కమిషనర్ గోవింద నాయక్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓపెన్ స్కూలు విద్యార్థులకు కూడా రెగ్యుల్ విద్యార్థులతో అన్నింటిలో సమాన అవకాశాలుంటాయని ఓపెన్ స్కూలు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ తెలిపారు. పోటీతత్వం అలవరచుకుని విజేతలుగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. కర్నూలు మేఘన ఓపెన్ స్కూలులో శనివారం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూలులో విద్యనభ్యసించిన విద్యార్థుల్లో చాలామందికి కొన్ని అపోహలు ఉన్నాయని, వీటిని తొలగించాల్సిన బాధ్యత ఓపెన్ స్కూలు యాజమాన్యాలపై ఉందని చెప్పారు. రెగ్యులర్ విద్యార్థులతో పోల్చుకుంటూ ఓపెన్ స్కూలు విద్యార్థులు తమను తాము తక్కువ చేసుకుంటూ ఉంటారని చెప్పారు. విద్యను అభ్యసించడంలో రెగ్యులర్, ఓపెన్ అనే తేడా విద్యారంగంలో లేదని గోవింద నాయక్ అన్నారు. ఓపెన్ స్కూలులో చదివిన కొన్ని వేల మంది విద్యార్థులు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డిఎస్‌సిలో ఎంపికై టీచర్ ఉద్యోగాలు పొందారనిచెప్పారు. మేఘన ఓపెన్ స్కూలు కరెస్పాండెంట్ విజయ రాఘవేంద్ర మాట్లాడుతూ తమ స్కూలులో చదివిన విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం అధికంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా స్కూలు యాజమాన్యం గోవిందనాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూలు నిర్వాహకులు రహిమాన్, రియాజున్, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ ఇస్తున్న అసిస్టెంట్ కమిషనర్



సీజనల్ హాస్టల్ ప్రారంభం

ప్రజాశక్తి-పత్తికొండ

వలసలు వెళ్లే కుటుంబాల పిల్లల చదువుకు ఆటంకం లేకుండా కాలానుగుణ వసతి కేంద్రాలను(సీజనల్‌హాస్టళ్లను) సద్వినియోగం చేసుకోవాలని మండల ఉపవిద్యాధికారి రమేష్ సూచించారు. శనివారం పత్తికొండ మండలంలోని నలకదొడ్డి, దేవనబండ, కోతిరాల, దూదేకొండ గ్రామాలలో కాలానుగున వసతి కేంద్రాలను మండల ఉప విద్యాధికారి రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద మధ్య తరగతి వలస కుటుంబాల పిల్లలను వసతి కేంద్రాలలో చేర్చాలని అన్నారు. వలస వెళ్లే పిల్లల చదువు మధ్యలోనే ఆగిపోకూడదనే ఉద్దేశంతో పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యామ్‌కుమార్ ప్రభుత్వం తరపున కాలానుగున వసతి కేంద్రాలను మంజూరు చేయించారన్నారు. పిల్లల తల్లిదండ్రులు ఏవైనా సమస్యలుంటే మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. టిడిపి నాయకులు బత్తిని రాజశేఖర్, నాగేష్,పరమేష్, రంగస్వామి, గోవిందు, ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి ,జాకీర్ హుస్సేన్, రామాంజనేయులు, ఉపేంద్ర ,ప్రభాకర్, పొదుపు మహిళలు లక్ష్మీదేవి ,రాజేశ్వరి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తి మండలం మాదా ర్‌పురం వద్ద గంజాయిని పోలీ సులు స్వాధీనం చేసు కున్నారు. అధి కారులకు అందిన సమాచారం మేరకు ...శనివారం వెల్దుర్తి సిఐ యుగంధర్, ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో అగ్రికల్చర్ ఆఫీసర్, ఆర్ఐ, పోలీసు సిబ్బంది కలిసి మాదార్‌పురం బస్ స్టాప్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవర్ధనగిరి గ్రామానికి చెందిన ఎరుకల లక్ష్మన్న గంజాయి తీసుకొని వెళ్తుండగా పట్టుకున్నారు. పంచాయతీ దారుల సమ క్షంలో అతని వద్ద నుంచి పచ్చి గం జాయిని సీజ్ చేసి కేసు నమో దు చేసి నట్లు పోలీ సులు తెలి పారు. గం జాయి సాగు చేసి నా, అమ్మినా కఠిన చర్యలు ఉంటాయన్నారు.



గంజాయిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆకాంక్షించారు. శనివారం పట్టణ ఉర్దూ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ... మైనార్టీ విద్యార్థుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎంఇఒ మధుసూదన్, ప్రధానోపాధ్యాయులు కోటప్ప, ఉపాధ్యాయులు రోహిణి కుమారి, నిస్సార్ అహ్మద్, అంబయ్య, నాగరాజు, అబ్దుల్ కలాం, అబ్దుల్లాజీ, చాంద్ బాషా, జహీరా మోబినా, నాయకులు మహేష్, కెటి.వెంకటేష్, అల్తాఫ్, బందే నవాజ్, తురేగల్ నజీర్ అహ్మద్, షబ్బీర్, దాదాసాహెబ్, అమాన్, ఇస్సాక్, నాగూర్ బాష, సలాం, ఖాదర్ బాషా, మమతా మెడికల్ స్టోర్ నిర్వాహకులు ఫకీర్ సాబ్ పాల్గొన్నారు.

విద్యార్థి సమస్యల పరిష్కార వేదిక ఎస్ఎఫ్ఐ

- జిల్లా కార్యదర్శి రంగప్ప



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యార్థి సమస్యల పరిష్కార వేదిక ఎస్ఎఫ్ఐ అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, పట్టణ అధ్యక్షులు రాము తెలిపారు. శనివారం ఎమ్మిగనూరు ఎంఇఒ ఆంజనేయులు ఎస్ఎఫ్ఐ జిల్లా స్వర్ణోత్సవ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా 50వ స్వర్ణోత్సవ మహాసభలు డిసెంబర్ 4, 5వ తేదీల్లో ఆలూరు పట్టణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలు సాగిస్తున్న ఎస్ఎఫ్ఐ ఈ మహాసభల ద్వారా గత 49 మహాసభల ఉద్యమ అనుభవాలను సమీక్షించి, భవిష్యత్తు కార్యాచరణకు దిశానిర్దేశం చేయబోతుందని చెప్పారు. జిల్లాలో ఎస్ఎఫ్ఐ అనేక చారిత్రక విజయాలు సాధించిందని గుర్తు చేశారు. రాయలసీమ యూనివర్సిటీ స్థాపన, పేద విద్యార్థుల హాస్టల్ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ కళాశాలల రక్షణ, విద్యార్థి హక్కుల కోసం నిరంతర ఉద్యమాలు వంటి అంశాల్లో ఎస్ఎఫ్ఐ ప్రత్యేక పాత్ర పోషించిందన్నారు. ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు వీరేంద్ర, వీరేష్, రాజు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - హాలహర్వి


ప్రారంభోత్సవంలో పాల్గొన్న వైకుంఠం జ్యోతి

హాలహర్విలో టిడిపి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. శనివారం టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి, ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బెల్డేకల్ వెంకటేష్ రిబ్బన్ కత్తిరించి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రతి కార్యకర్త సైనికునిలా పని చేయాలని సూచించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సూపర్ సిక్స్ పథకాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని తెలిపారు. ఈ సూపర్ సిక్స్ పథకాలే కూటమిని గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అశుండి శ్రీధర్, క్లస్టర్ ఇన్‌ఛార్జి పాల్ రెడ్డి, మోకా ప్రకాష్ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ప్రభుత్వ బీసీ బాలుర సాంఘిక సంక్షేమ హాస్టల్‌లోని 398 మంది విద్యార్థులకు డాక్టర్ అరుణ జ్యోతి ఆధ్వర్యంలో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. గజ్జి, తామర, దురద, ఫంగల్ ఇన్ఫెక్షన్స్, పుండ్లు, దగ్గు, జలుబు వంటి వ్యాధులున్న విద్యార్థులకు మందులు, ఆయింట్‌మెంట్లను పంపిణీ చేశారు. డాక్టర్ అరుణ జ్యోతి మాట్లాడుతూ... వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, పోషకాహారం గురించి విద్యార్థులకు వివరించారు. హాస్టల్‌లోని విద్యార్థుల గదులను, వంటశాలను, బాత్‌రూములను మరుగుదొడ్లను పరిశీలించారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని హాస్టల్ వార్డెన్ కోటేశ్వరయ్యకు సూచించారు. ఆరోగ్య విస్తరణాధికారి రంగస్వామి, ఆరోగ్య కార్యకర్త నాగ వేణి, ఎంఎల్‌హెచ్‌పి శ్రీవాణి పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

లోపించిన పారిశుధ్యం

- కంపు కొడుతున్న గ్రామాలు - ఏడాదికిపైగా వీధిలోకి రాని చెత్తబండి
- కనిపించిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని చాలా గ్రామాలు పారుశుధ్య లోపంతో కంపు కొడుతున్నాయి. చెత్తను సేకరించే బండ్లు ఏడాదికిపైగా వీధుల్లోకి రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర' మండలంలో కనిపించడం లేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నందవరం, మండలంలోని చాలా గ్రామాలు పారిశుధ్య లోపంతో, చెత్తాచెదారంతో నిండి కంపు కొడుతున్నాయి. కాలువల్లో మురుగు నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాలతో ఆస్పత్రి పాలవుతున్నారు. నందవరంలో చాలా వీధుల్లో చెత్త


గ్రామంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

సేకరించే బండ్లు రావడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. చెత్త బండ్లు రాకపోవడంతో ప్రజలు ఇంట్లోని చెత్త తీసుకెళ్లి ఖాళీ ప్రదేశాల్లో వేస్తున్నారు. దాదాపు 16 నెలలుగా తమ కాలనీలోకి చెత్త బండ్లు రావడం లేదని 7వ వార్డు ప్రజలు చెప్పుకొచ్చారు. 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం ఉన్న సమయంలో అధికారులు రెండు సార్లు వీధిని సందర్శించారు. తర్వాత వీధి వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని వీధి ప్రజలు వాపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల గ్రామాలు చెత్త వాడలుగా మారాయని పేర్కొంటున్నారు. గ్రామాల్లో చాలా చోట్ల మురుగు నిండి డ్రెయినేజీలు దుర్భరంగా ఉన్నాయి. డ్రెయినేజీలను శుభ్రం చేయక చాలా నెలలు గడిచిందని నందవరం ప్రజలు మండిపడుతున్నారు. గ్రామంలో అధికారుల పర్యవేక్షణ కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాలను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దుతామంటూ 'స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం చేపట్టింది. ఆ కార్యక్రమాన్ని నందవరం మండలానికి సంబంధించిన అధికారులు నిర్వీర్యం చేశారు. నెలకోసారి తూతూమంత్రంగా ప్రభుత్వ ఒత్తిడి మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం, పరిసరాల పరిశుభ్రతపై చర్యలు తీసుకోవడంపై అధికారులు చేతులెత్తేశారు.


మురుగుతో నిండిన డ్రెయినేజీ కాలువ



కంపు భరించలేకున్నాం

- చాకలి అయ్యమ్మ

మా వీధి చెత్తకుప్పల తయారయింది. చెత్తాచెదారం పేరుకుపోయింది. డ్రెయినేజీ కూడా నిండి కంపు భరించలేకపోతున్నాం.

దోమల నివారణ చర్యలు లేవి..?

- రాము, నందవరం గ్రామం

దోమల నివారణ చర్యలు తీసుకోవడం లేదు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగు వల్ల దోమలు వృద్ధి చెందాయి. వాటిని నివారించడానికి శానిటేషన్, బ్లీచింగ్ చల్లడం చేయడం లేదు.

స్పందించని అధికారి

మండలంలో లోపించిన పారిశుధ్యంపై డిప్యూటీ ఎంపిడిఒ సందీప్‌ను వివరణ కోరగా ఆయన స్పందించలేదు.

ఎస్ఐని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - నందవరం

నందవరం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన తిమ్మారెడ్డిని టిడిపి పొనకలదిన్నె గ్రామ నాయకులు శ్రీరాములు, లక్ష్మీకాంత్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, పూలమాల వేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వెంకట్రాముడు, కృష్ణ, అంజి, తిమ్మారెడ్డి, నరసింహులు, గాంధీ పాల్గొన్నారు.


ఎస్ఐని సన్మానిస్తున్న నాయకులు

స్తంభించిన ట్రాఫిక్

- బారులు తీరిన వాహనాలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో ట్రాఫిక్ స్తంభించడంతో వాహనాలు బారులు తీరాయి. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో రాఘవేంద్రస్వామి దర్శనార్థమై వివిధ ప్రాంతాల నుంచి బస్సుల్లో, ప్రయివేట్ వాహనాల్లో మంత్రాలయం చేరుకున్నారు. రాఘవేంద్ర సర్కిల్‌లో వాహనాలు నిలిచిపోయాయి. సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాలను మళ్లించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూశారు. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మి నారాయణ, ఎంవి.రమణ, ఆంజనేయులు, రాముడు, పోలీసులు ఫరూక్, రామకృష్ణ, ప్రతాప్, నాగరాజు, హోంగార్డ్ ఎల్లప్ప, ఖాజా మహబూబ్, వీరేష్, హుస్సేన్ ట్రాఫిక్‌ను నియంత్రించారు.


ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీసులు

తాగు, సాగునీటి సమస్యలు పరిష్కరించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గ్రామాల్లో తాగు, సాగునీటి సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని గోనెగండ్ల బైపాస్ రోడ్డు దగ్గర సిపిఎం ఆధ్వర్యంలో జీపు జాతాను రాధాకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. కరుణాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడారు. తుంగభద్ర కాలువ నుంచి ప్రతేడాది నీటి వాటా తగ్గుతోందని, దిగువ ఉన్న భూములకు సాగునీరందడం లేదని తెలిపారు. గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకం ఎత్తిపోయిందని, పట్టించుకునే నాథుడే లేరని చెప్పారు. ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణంపై ఎన్నికల ముందు వాగ్దానాలు చేస్తారని, తర్వాత పట్టించుకోరని మండిపడ్డారు. తుంగభద్ర నది నుంచి వందల టిఎంసిల నీరు వృథా అవుతూ సముద్రం పాలవుతోందని తెలిపారు. ఎమ్మిగనూరు పట్టణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని గుడికల్ చెరువులో పూడికను తీసి ఎల్ఎల్‌సి ద్వారా నీటితో నింపి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గురు శేఖర్, పట్టణ కార్యదర్శి గోవిందు, పట్టణ కమిటీ సభ్యులు హనుమంతు, రాముడు, లక్ష్మిసరసయ్య, సురేష్, రమేష్, రాముడు, నబి, అంజి పాల్గొన్నారు. **గోనెగండ్ల**కు జీపుజాతా చేరుకుంది. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు గురు శేఖర్ మాట్లాడుతూ... మండలంలో ఎల్ఎల్‌సి చివరి ఆయకట్టు భూములకు నీరందక ఏటా ఆయకట్టు విస్తీర్ణం తగ్గుతోందని తెలిపారు. సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 10న ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే మహాధర్నాలో రైతులు కార్మికులు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం ఎమ్మిగనూరు నాయకులు గోవిందు, గోనెగండ్ల నాయకులు కరుణాకర్, నబి రసూల్ పాల్గొన్నారు. **కౌతాళం**లోని ఎన్‌టిఆర్ నగర్, తలారి గేరి, ఎస్సీ కాలనీ, శివప్ప నగర్, మెయిన్ బజార్‌లో మూడోరోజూ జీపుజాతా నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న మాట్లాడుతూ... కౌతాళంలో వారానికి ఒకరోజు తాగునీరు సరఫరా అవుతున్నా పట్టించుకునే నాథుడే లేరని విమర్శించారు. నీటి సమస్య పరిష్కారం కోసం కౌతాళంలో అదనంగా రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించాలని, కౌతాళం ఆస్పత్రిని 30 పడకలుగా మార్చి, రాజనగర్ ఎస్–ఎస్ ట్యాంకులో ఫిల్టర్ బెడ్లు శుభ్రం చేస్తూ, ఫిల్టర్ చేసి నీళు వదలాలని డిమాండ్ చేశారు.


ఎమ్మిగనూరులో జీపు జాతాను ప్రారంభిస్తున్న రాధాకృష్ణ



కౌతాళంలో మాట్లాడుతున్న నాయకులు

ఎల్ఎల్‌సిలో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మండలం బసాపురం గ్రామానికి చెందిన హరికృష్ణ (12) ఎల్ఎల్‌సి కాలువలో గల్లంతై మృతదేహంగా తేలాడు. బంధువుల వివరాల మేరకు... నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన రంగస్వామి, వరలక్ష్మి దంపతుల కుమారుడు హరికృష్ణ. వరలక్ష్మి పుట్టినిల్లు బసాపురం గ్రామానికి గౌరీ పండగ కోసం వచ్చారు. స్నేహితులతో కలిసి ఎల్ఎల్‌సిలో ఈతకు వెళ్లి శుక్రవారం సాయంత్రం గల్లంతయ్యాడు. శనివారం ఉదయం మండలంలోని హనవాలు గ్రామం వద్ద కాలువలో మృతదేహంగా తేలాడు. హరికృష్ణ మృతితో తల్లి వరలక్ష్మి రోధించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఇస్వి పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- అరికట్టాలని గ్రామస్తుల డిమాండ్


ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న ఇసుక

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ హంద్రీ వాగులో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. హంద్రీ వాగులో గోనెగండ్ల మండలం బైలుప్పల, అగ్రహారం గ్రామాలకు చెందిన ట్రాక్టర్ యజమానులు ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు విమర్శిస్తున్నారు. హంద్రీ వాగులో ఇసుకను తరలిస్తుండడంతో పర్యావరణ పరిరక్షణకు ముప్పు ఏర్పడుతున్నట్లు, భూగర్భ జలాలు అడుగంటి రైతుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొంటున్నారు. సంబంధిత రెవెన్యూ, మైనింగ్ శాఖాధికారులు అక్రమ ఇసుక రవాణా అరికట్టాలని కోరుతున్నారు.

హైకోర్టు ఎజిపిగా యువ శివ స్వామి

ప్రజాశక్తి - మంత్రాలయం




మండలంలోని మాలపల్లి గ్రామానికి చెందిన యువ శివ స్వామి హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులయ్యారు. హైకోర్టులో ఎజిపిగా నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మాలపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్వరమ్మ, మల్లికార్జున స్వామి కుమారుడు న్యాయవాది యువ శివ స్వామి ప్రాథమిక విద్యాభ్యాసం మాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సాగింది. విద్యానగర్ ఎస్ఎంకెవి హైస్కూల్‌లో పదో తరగతి పూర్తి చేశారు. కోసిగిలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేశారు. ఎపి రెసిడెన్షియల్ కళాశాల నాగార్జున సాగర్‌లోను, లా డిగ్రీ తిరుపతి, అనంత లా కళాశాలలోనూ పూర్తి చేశారు. కాగా 2017 మార్చిలో రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ చేసుకుని, హైదరాబాద్, కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు కోర్టుల్లో ప్రాక్టీస్ చేశారు. 2019 నుంచి హై కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆయన నియామకంపై కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, న్యాయవాదులు శనివారం హర్షం వ్యక్తం చేశారు.

కనకదాసు జీవితం ఆదర్శం : ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కనకరాజు జీవితం ఆదర్శనీయమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆధునిక కవి భక్త కనకదాసు జయంతి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే బీవీ పాల్గొని కనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భక్త కనకదాసు కులమతాలకతీతంగా సమాజాభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, టిడిపి మండల అధ్యక్షులు కెటి.వెంకటేష్, గోనెగండ్ల మండల అధ్యక్షులు తిరుపతయ్య నాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షులు మహేష్, రంగస్వామి గౌడ్ పాల్గొన్నారు. **కౌతాళం**లో శ్రీభక్త కనకదాసు జయంతి వేడుకలను కురువలు, కూటమి నాయకులతో కలిసి శనివారం ఘనంగా నిర్వహించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప మాట్లాడారు. భక్త కనకదాసు జయంతి నిర్వహణకు శాశ్వత జిఒ విడుదల కావడంతో కురువల హామీ నెరవేర్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు రుణపడి ఉంటామన్నారు. అంతకుముందు కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి కొట్రేష్ గౌడ్, సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం, సిద్దేష్, ఉరుకుంద మాజీ ఎంపిటిసి కురుగోడప్ప, టౌన్ అధ్యక్షులు కాశీ విశ్వనాథ్, దొడ్డనగౌడ్, మంజునాథ, సిద్ధు, రాజబాబు, రహిమాన్, సోమన్న, కావలి వీరప్ప, నరసింహ, పూగి నాగప్ప, రఘురాం పాల్గొన్నారు. కురువ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివన్న, మండల అధ్యక్షులు వీరేష్, లింగన్న, రామస్వామి, సిద్ధన గౌడ్, ఉప్పలప్ప, తుంగభద్ర బోర్డు చైర్మన్ టిప్పు సుల్తాన్, సహకార సంఘం అధ్యక్షులు వెంకటపతి రాజు, చౌదరి బసవరాజు వేర్వేరుగా కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **కోసిగి** గ్రామంలోని గీతాశ్రమంలో కురువ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో భక్త కనకదాసు జయంతి నిర్వహించారు. ముందుగా కనకదాసు చిత్రపటానికి కురువ సంఘం సీనియర్ నాయకులు మల్లయ్య, జడే తాయన్న, కురువ ముక్కన్నలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కురువ సంఘం మండల నాయకులు వీరేష్, గూటాల ఈరన్న, బోలందొడ్డి నరసన్న, బోలం దొడ్డి వీరేష్, రమేష్, వీరేష్, రామకృష్ణ, చిన్న వీరేష్, పెద్ద వీరేష్, నాగరాజ్ పాల్గొన్నారు.


ఎమ్మిగనూరులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీవీ, కార్యకర్తలు


కౌతాళంలో నివాళులర్పిస్తున్న నాయకులు


కోసిగిలో

రాష్ట్రస్థాయి పోటీలకు మదిరే విద్యార్థులు

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మదిరే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు రంగన్న తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణంలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శుక్రవారం నంద్యాలలో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచి పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. అండర్–14 విభాగంలో అలేఖ్య, అండర్–17 విభాగంలో కాకినాడలో జరగబోయే పోటీలకు సరస్వతి, లింగమూర్తి ఎంపికయ్యారన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి పాఠశాలకు, ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని, జాతీయస్థాయి పోటీలకు కూడా అర్హత సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు ఈరన్నను అభినందించారు.


విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి

ప్రజాశక్తి - ఆదోని

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన కబడ్డీ అండర్–14 విభాగంలో ఆదోని ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి చరణ్ దేవ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయులు కె.రవి తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థి చరణ్ దేవ్‌ను అభినందించారు. వారు మాట్లాడుతూ... రాష్ట్రస్థాయికి తమ పాఠశాల విద్యార్థి ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు రామకృష్ణను అభినందించారు. ఉపాధ్యాయులు జి.వీరచంద్ర యాదవ్, గిడ్డా రెడ్డి, మహేశ్వరి, శ్రీనివాసులు, శ్రీరాములు, చక్రపాణి, బ్రహ్మానంద రెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న సిబ్బంది

సాషలో ఆధునిక సదుపాయాలతో సంతాన సాఫల్యం

- వైద్యులు సిఆర్ రేష్మ, కిరణ్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని


చాలా కాలంగా సంతానం కలగని దంపతులకు ఆధునిక పద్ధతుల్లో వైద్యం అందించి సంతాన సాఫల్యం కల్పించే సదుపాయం తమ నర్సింగ్ హోమ్‌లో అందుబాటులో ఉందని సాష నర్సింగ్ హోమ్ స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ సిఆర్.రేష్మ, చైల్డ్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎం.కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం వారు మాట్లాడారు. పట్టణంలోని సాయి జూనియర్ కళాశాల సమీపంలో తమ ఆస్పత్రి ఉందన్నారు. అత్యవసర కేసులు, సంతానం లేని వారికి ఆధునిక శాస్త్రీయ పరీక్షలు, ఎల్‌విఎఫ్, ఐయుఐ వంటి అత్యాధునిక వైద్య సేవలందిస్తూ దంపతుల మన్ననలు పొందామని చెప్పారు. గర్భిణులకు, మహిళల సమస్యలకు స్కానింగ్ చేయడం జరుగుతుందన్నారు. చిన్న పిల్లలు, నవజాత శిశు వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చిన్నారులకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉందన్నారు. పురిటి బిడ్డలకు, చిన్న పిల్లలకు అన్ని రకాల వైద్య సదుపాయాలతో మెరుగైన వైద్యం తమ ప్రత్యేకత అని తెలిపారు. తల్లిబిడ్డల ఆస్పత్రి, ఇన్‌ఫర్టిలిటీ సెంటర్ సదుపాయాలు ఉన్నాయన్నారు. తమ నర్సింగ్ హోమ్‌ను సందర్శించి, మెరుగైన తమ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 7032672129, 7997154692 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.



డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ సిఆర్.రేష్మ

మాలపల్లిలో కోటి సంతకాలు సేకరణ

ప్రజాశక్తి - మంత్రాలయం


సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

కూటమి ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణను నిర్వహించారు. శనివారం మండలంలోని మాలపల్లి గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు సంతకాల సేకరణ చేపట్టారు. వైసిపి లీగల్ సెల్ ప్రతినిధి మాలపల్లి గురురాజరావు, సర్పంచి సీతారామిరెడ్డి, వైసిపి నాయకులు వీరేష్, గుండాల రోగప్ప, నరసింహులు, గోపాల్, నాగరాజు, హుస్సేని, రామకృష్ణ, సిద్ధప్ప, నాగన్న, కెపి.వీరేష్, భీమసేన, తిరుమల, సురేష్ పాల్గొన్నారు. అలాగే వైసిపి జిల్లా కార్యదర్శి సివి.విశ్వనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వగరూరు గ్రామంలో సంతకాల సేకరణ చేపట్టారు. సర్పంచి వీరారెడ్డి పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

ప్రజాశక్తి - కోసిగి


అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

మండలంలోని జంపాపురం గ్రామంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి సర్పంచి హరోన్ అధ్యక్షతన గ్రామస్తుల ఆధ్వర్యంలో శనివారం భూమి పూజ చేశారు. ముఖ్య అతిథులుగా ఎంఆర్‌పిఎస్ మంత్రాలయం ఇన్‌ఛార్జి బండారు హనుమంతు మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు దుర్గప్ప మాదిగ, మండలం అధ్యక్షులు సామేలు హాజరయ్యారు. తాలూకా నాయకులు దేవన్న మాదిగ, సాల్మన్ మాదిగ, జయన్న మాదిగ, మండల నాయకులు ప్రకాష్ మాదిగ, నరసింహులు, ఉరుకుందప్ప, నరసయ్య, నాగరాజు, జంపాపురం గ్రామ పెద్దలు ఏసయ్య, కొండయ్య, ఆదాము, యువకులు ప్రకాష్, పురుషోత్తం, మనోహర్, బసప్ప, అబ్రహాం పాల్గొన్నారు.

శ్మశానానికి రోడ్డు బాగు చేయిస్తాం

- టిడిపి ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి

ప్రజాశక్తి - చిప్పగిరి


వైకుంఠం జ్యోతిని కలిసిన బంటనహాల్ గ్రామ సర్పంచి, ప్రజలు

బంటనహాల్ గ్రామస్తులు శ్మశానానికి వెళ్లే రహదారి లేక ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనని, శ్మశానానికి రోడ్డు బాగు చేయిస్తామని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి తెలిపారు. శనివారం బంటనహాల్ సర్పంచి సుశీలమ్మ కుమారుడు, టిడిపి సీనియర్ నాయకులు సురేష్ వైకుంఠం జ్యోతిని కలిశారు. తమ గ్రామంలో శ్మశానానికి వెళ్లే రహదారికి బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఆమె స్పందిస్తూ... శ్మశానానికి సరయిన రహదారి లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండడం తన దృష్టికి వచ్చిందని, వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి రహదారి బ్రిడ్జికి, మరమ్మతులు చేపట్టేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. టిడిపి నాయకులు గుమ్మనూరు అంపయ్య, టిడిపి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలీ పాల్గొన్నారు.

IN THE COURT OF IV ADDL JUNIOR CIVIL JUDGE : KURNOOL

E.P. NO. 243/2024 in O.S NO. 475/2020

M.K.Murali Mohan ... DHr

-Vs-

N.Vijaya Baskar Reddy ... JDr

NOTICE TO JDR

N.Vijaya Baskar Reddy
S/o N.Seetharami Reddy,
L.I.C Agent & Business,
H.No. 4-31-19, Balaji Nagar, Kurnool.

పై కనిన అర్జీదారుడు తనకు రావలసిన డిక్రి మొత్తము 2,11,646/– ముందు వడ్డి మరియు కోర్టు ఖర్చులతో సహా రాబట్టుకొనుటకు పై అమలు అర్జీ పై కోర్టులో దాఖలు చేసివున్నాడు. సదరు అమలు అర్జీ 03–12–2025 వ తేది వాయిదా వేసువున్నారు.

కాబట్టి JDr అయిన మీకు ఈ నోటీసు ద్వారా తెలియజేయడం ఏమనగా మీరు 03–12–2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీ వాదనను తెలియజేసుకోవలెను లేనియెడల మిమ్మల్ని Experteగా భావించి మీ పరోక్షమునందు తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది :03-12-2025

M. Shafi Ullah Ansari,
Advocate for DHr.
Kurnool.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE :: ADONI (SENIOR DIVISION)

I.P.No. 24/2025

Between:
T. Prakash Reddy ..... Petitioner

Vs.

1) C. Kusuma, W/o. C. Shanmukha
2) N. Rajasekhar Reddy, S/o. Ramireddy
3) L. Sharada, D/o. Narayana
4) S. Venu Gopal, S/o. Not Known
5) Hemalatha Suri Shetty, W/o Venkataramanaiah
6) S. Narayanamma, W/o. Kondayya
7) Kalpana, W/o. Sreedhar

.... Respondents

GENERAL NOTICE

Whereas the above name petitioner filed petitioner U/Sec. x (2) R/w 13 of provincial insolvency act to declare the petitioner as insolvent. Hence anybody wants any objections with regard to the above petition are hereby appear before this court on **12-11-2025 at 10:30 AM** and file objections if any otherwise the petition will be decided on merits.

(By Court Order)

Sri BADDAL VENKATESH YADAV,
Sri N. KRISHNAIAH,
Sri D. NAGARAJU,
Advocates, Adoni
Mobile: 9948185185

విద్యుత్ బిల్లు ఆదాకు 'కీర్తి సోలార్ పవర్ ఏజెన్సీస్' మార్గం

-తక్కువ ఖర్చుతో అధిక లాభాలు -సూర్యఘర్ టాటా పవర్ సొల్యూషన్‌పై ప్రజల్లో విశేష స్పందన
-విద్యుత్ ఖర్చులు తగ్గించుకునే దిశగా ప్రజల అడుగులు
ప్రజాశక్తి-కర్నూలుకార్పొరేషన్

కర్నూలు జిల్లాలో సోలార్ విద్యుత్ వినియోగంపై ప్రజల్లో ఆసక్తి వేగంగా పెరుగుతోంది. విద్యుత్ చార్జీలు అధికమవుతున్న నేపథ్యంలో, తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్‌ను పొందేందుకు కుటుంబాలు, రైతులు, వ్యాపారవేత్తలు సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలను ఎంచుకుంటున్నారు. కర్నూలు , నంద్యాల జిల్లాలలో రూ. లక్షల కరెంట్ బిల్లులు వస్తున్న పరిశ్రమలు, హాస్పిటల్స్ , విద్యాసంస్థలు ఈ సోలార్ వేసుకొని కరెంట్ బిల్లుల నుండి ఎంతో ఆదాను పొందుతున్నారు.

సూర్యఘర్ - టాటా పవర్ సొల్యూషన్ ద్వారా కీర్తి సోలార్ సేవలు

భారతదేశంలో అగ్రగామి సోలార్ రూఫ్‌టాప్ కంపెనీగా పేరొందిన ప్రధానమంత్రి సూర్యఘర్ – టాటా పవర్ సోలార్ రూఫ్ సంస్థ, ప్రజలకు అందుబాటులో ఉండే ఇఎంఐ సదుపాయాలతో సేవలను అందిస్తోంది.ఈ సదుపాయాలను కర్నూలు జిల్లా ఛానెల్ పార్ట్నర్‌గా 'కీర్తి సోలార్ పవర్ ఏజెన్సీస్' ద్వారా అందిస్తున్నారు. ఛానెల్ పార్ట్నర్ కీర్తి సోలార్ పవర్ ఏజెన్సీస్ సురం జనార్ధన రెడ్డి మాట్లాడుతూ ప్రజలు సోలార్ వైపు పెద్ద ఎత్తున మొగ్గు చూపుతున్నారన్నారు. విద్యుత్ బిల్లులు తగ్గించుకునే అవకాశం మాత్రమే కాదు, పర్యావరణ హితమైన శక్తిని వినియోగించడం వల్ల మన భవిష్యత్తు తరాలకు కూడా మేలు జరుగుతుందన్నారు. టాటా పవర్ సొల్యూషన్‌తో కష్టమర్లు తక్కువ వడ్డీ రుణాలు, ప్రభుత్వ సబ్సిడీలతో పెద్ద ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు.

సబ్సిడీ వివరాలు: ఒక కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్ సిస్టమ్ రూ.30,000 సబ్సిడీ, రెండు కిలోవాట్ సిస్టమ్ రూ.60,000 సబ్సిడీ, మూడు కిలోవాట్ పైగా ఉన్న సిస్టమ్ రూ.78,000 సబ్సిడీ సంస్థ ఎస్‌బిఐ, యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఎపిజిబి బ్యాంకులతో భాగస్వామ్యంగా రుణ సదుపాయాలను కల్పిస్తుందన్నారు.

మా ఉత్పత్తులు: సోలార్ పవర్ గడులు, సోలార్ నీటి హీటర్లు, సోలార్ వ్యవసాయ పంపులు, సోలార్ ఆఫ్–గ్రిడ్, సోలార్ ఆన్–గ్రిడ్, సోలార్ హైబ్రిడ్ సిస్టమ్స్, సోలార్ బాటరీలు, సోలార్ లైట్లు మొదలైనవి.మా సేవలు: సిస్టమ్ డిజైన్, ఇన్‌స్టలేషన్, ఆపరేషన్, మెయింటెనెన్స్ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయి. అనుభవజ్ఞులైన సాంకేతిక బృందం ద్వారా 48 గంటల్లోపు ప్రాసెసింగ్ పూర్తి అవుతుంది. అన్ని రంగాలకు అనుకూలం సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలు ఇళ్లకు, కార్యాలయాలకు, పాఠశాలలకు, పెట్రోల్ బంకులకు, హాస్పిటళ్లకు వంటి అన్ని రంగాల అవసరాలకు సరిపడేలా రూపొందించబడ్డాయి.



వినియోగదారుల అభిప్రాయాలు

భాష సఫా వాటర్ ప్లాంట్, కర్నూలు

మా ప్లాంట్‌లో విద్యుత్ ఖర్చులు గణనీయంగా తగ్గాయి. ఎనిమిది సంవత్సరాలనుండి సోలార్ వాడుతున్నాను. గతంలో నాకు కరెంట్ బిల్లు రూ.45,000 పైగా వచ్చేది. ప్రస్తుతం రూ.4వేల దాకా వస్తుంది. టాటా పవర్ సిస్టమ్ అమర్చిన తర్వాత నెలకు దాదాపు 80శాతం విద్యుత్ బిల్లు తగ్గింది. కీర్తి సోలార్ అందించిన సేవలు వేగంగా, నాణ్యతతో ఉన్నాయి.

పర్యావరణ హిత పరిష్కారం : నిపుణుల ప్రకారం, సోలార్ వినియోగం వల్ల విద్యుత్ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ , ఆర్థిక స్వయం సమృద్ధి సాధ్యమవుతోంది.

డీలర్లకు ఆహ్వానం: కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కొత్త డీలర్లను ఆహ్వానిస్తున్నట్లు కీర్తి సోలార్ పవర్ ఏజెన్సీస్ ప్రతినిధులు తెలిపారు. సోలార్ ప్రాజెక్టుల ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతున్నాయని వివరించారు. కీర్తి సోలార్ పవర్ ఏజెన్సీస్, వెజిటేబుల్ మార్కెట్, గోడౌన్ నెం.4, ఆర్టీసీ బస్టాప్ దగ్గర, కర్నూలు – 518003, 94401 55473, 81062 20228, 81062 23228, 93987 85552 పైచిరునామాకు, లేదా పై సెల్‌ఫోన్లను సంప్రదించాలన్నారు.

చకచకా రహదారి విస్తరణ పనులు

-కిడ్స్ వరల్డ్ నుండి విస్తరణకు 25 ఆస్తిదారులు అంగీకారం
- స్వచ్ఛందంగా నగరాభివద్ధికి తోడ్పాటు
ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



నగరాభివృద్ధిలో భాగంగా ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన రహదారుల విస్తరణ పనులను వేగవంతం చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దశాబ్దాలుగా నోచుకోని రహదారి విస్తరణలను ప్రణాళికాబద్ధంగా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. బళ్లారి చౌరస్తా వద్ద ట్రాఫిక్ నియంత్రణ కోసం ఆంజనేయస్వామి ఆలయం వెనుక బైపాస్ రహదారి నిర్మాణం పూర్తయిందన్నారు. గడియారం ఆసుపత్రి, బండిమెట్ట ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించామన్నారు. అంబేద్కర్ సర్కిల్ నుండి పెద్ద మార్కెట్ వరకు విస్తరణ ప్రక్రియ త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. నందికొట్కూరు రోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని, తాజాగా మెడికల్ కాలేజీ మలుపు వద్ద విస్తరణకు మార్గం సుగమం అయిందన్నారు. స్వచ్ఛందంగా మసీదు కమిటీ వారు దుకాణాలను తొలగించుకోవడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో నగరాభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కిడ్స్ వరల్డ్ నుండి బుధవారపేట బ్రిడ్జి వరకు రహదారి విస్తరణకు ఆస్తి కోల్పోయే బాధితులతో మంత్రి టిజి.భరత్ సమావేశం నిర్వహించగా, ఇప్పటివరకు 25 మంది పత్రాలు బాధితులు సమర్పించి అంగీకారం తెలపడం అభినందనీయమని కమిషనర్ అన్నారు. మిగిలిన ఆస్తిదారులు కూడా త్వరితగతిన పట్టణ ప్రణాళిక అధికారులకు పత్రాలు అందించి నగరాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కమిషనర్ కోరారు.

సిఎం సహాయ నిధి పేదలకు వరం



-ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి
ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

సీఎం రిలీఫ్ ఫండ్ స్కీము పేదలకు ఓ వరమని ఎమ్మెల్యే బొగుల దస్తగిరి అన్నారు. కర్నూలు మం డలం ఈ.తాండ్రపాడు గ్రా మానికి చెందిన చాకలి లక్ష్మన్న కుటుంబానికి మం జూరైన చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. లక్ష్మన్న క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతూ వచ్చారు. ఆర్థిక పరిస్థితులు బాగా లేనందున వారు సహాయం కోసం కోడుమూరు ఎమ్మెల్యేని సంప్రదించి సిఎంఆర్ఎఫ్ పథకం కింద దరఖాస్తు చేసుకున్నారు. వారికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.6,00,000 ఎల్ఓసి చెక్కును అందజేశారు. చెక్కును తీసుకున్న బాధితులు సీఎం నారా చంద్రబాబు నాయుడుకు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి, డి.విష్ణువర్ధన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

12 న వైసిపి ప్రజా ఉద్యమం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం చేపడుతున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్వి మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం వైసిపి కర్నూలు జిల్లా కార్యాలయంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 12న జరగనున్న వైసిపి ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఎస్వి. మోహన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వి విజయ మనోహరి ఆవిష్కరించారు. వైసిపి కర్నూలు అబ్జర్వర్ కర్రహర్షవర్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్‌వి.మోహన్‌రెడ్డి, ఇతర నాయకులు



ఉద్యోగాలు వచ్చిన విద్యార్థులతో ప్రిన్సిపల్

కెవి సుబ్బారెడ్డి ఫార్మసీ కళాశాలలో ప్లేస్మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

నగర శివారు దూపాడులో డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి ఫార్మసీ ఇనిస్టిట్యూట్లో ఔషధ సంస్థ డివిస్ లాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్ని రకాల పరీక్షల్లో విజేతలుగా నిలిచిన వారిని డివిస్ లాబరేటరీస్ యాజమాన్యం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ కెవి సుబ్బారెడ్డి కరస్పాండెంట్ విజయలక్ష్మి, ప్రిన్సిపల్ రమణ మాట్లాడారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డివిస్ ఔషధ సంస్థ వారు ఉద్యోగ అవకాశాలు కల్పించడం సంతోషకరమన్నారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఇలాంటి ప్లేస్మెంట్ డ్రైవ్‌లు నిర్వహించడం వల్ల ఎంతోమంది విద్యార్థులకు ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, డివిస్ లాబరేటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.



వెల్దుర్తి పాఠశాలను పరిశీలించిన ఎంఇఒ

ప్రజాశక్తి-వెల్దుర్తి

వెల్దుర్తి లోని శ్రీ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ఎంఇఒ ఇందిర శనివారం సందర్శించారు. పాఠశాల ప్రాంగణంలోని మౌలిక వసతులను పరిశీలించి, 7వ, 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు.ఈ సందర్భంగా హెడ్‌మాస్టర్‌తో విద్యా ప్రమాణాలు, పాఠశాల పరిశుభ్రత, నామినల్ రోల్స్ నిర్వహణ తదితర అంశాలపై పాఠశాల సిబ్బందితో చర్చించారు. పాఠశాల వాతావరణం పరిశుభ్రంగా ఉండాలని, విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతి పట్ల నిరంతర పర్యవేక్షణ అవసరమని సూచించారు.

మారందొడ్డిలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోనీ మారందొడ్డిలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు నవగ్రహ విగ్రహాలను శనివారం ఘనంగా ప్రతిష్టించారు. గ్రామంలో ప్రతి ఇంటా భక్తులు, ఆడపడచులు అధిక సంఖ్యలో పాల్గొని నూతన వస్త్రాలు ధరించి నవగ్రహాలకు మొక్కులు తీర్చుకొన్నారు. ఇక్కడ పండుగ వాతావరణం నెలకొంది. నాగప్పలను, సత్యమ్మ, లింగమయ్య, మూడు చోట్ల బొడ్రాళు ,, సుబ్రహ్మణ్యం స్వామి, కుమారస్వామి వంటి విగ్రహాలు ఏర్పాటు చేయగా ఇందుకు విగ్రహ దాతలు ఉప్పరి చిన్న ఈరన్నను , అక్క చెల్లెల్ల కుటుంబాలను, ఉచిత అన్నదానం చేశారు.



రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు

ఎస్ఐ నరేష్ హెచ్చరిక

ప్రజాశక్తి-వెల్దుర్తి

స్థానిక బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఎస్ఐ ఎం.నరేశ్ శనివారం పర్యటించారు. తోపుడు బండ్లు, చిరువ్యాపారులు, వాహనదారులతో మాట్లాడారు. ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా చూడాలని సూచించారు. ప్రజా రాకపోకలకు ఇబ్బందులు కలిగే విధంగా తోపుడు బండ్లు లేదా వాహనాలు ఎక్కడపడితే అక్కడ రహదారులపై నిలిపితే కఠిన చర్యలు తప్పవనిహెచ్చరించారు. బస్టాండ్ పరిసరాలలో వాహనాలు నిలుప రాదని , ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. పర్యటనలో ఎస్ఐ నరేశ్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.